
# సత్యవాక్కు




## క్రైస్తవ మాస పత్రిక

# ఆహ్వానము

## GOSPEL CAMPAIGN

## క్రీస్తు సువార్త సభలు

by

## KAKINADA SCHOOL OF PREACHING

స్థలము : మునిసిపల్ టౌన్ హాల్, తాడేపల్లిగూడెం

తేదీలు : 1998 మార్చి 25, 26, 27
(గురు, శుక్ర, శనివారాలు)

సమయం : ప్రతీ రోజు ఉదయం 9-30 గం||లకు మరియు
రాత్రి 7-00 గం||లకు

ప్రసంగీకులు : Bro. నెహెమ్యాగూటం (కాకినాడ)
Bro. వై. లాజరు (ముదినేపల్లి)
Bro. పి. చంద్రశేఖర్ (కాకినాడ)
Bro. డి. చిరంజీవి (కాకినాడ)

గమనిక : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ విద్యార్థులు తాడేపల్లిగూడెం టౌన్ నందు గృహములు దర్శించి సువార్త పత్రికలు అందించుదురు మరియు బైబిలు పఠనములను జరిపింతురు.

వివరములకు : ఎం. సి.హెచ్. మోజెస్,
క్రీస్తు సంఘం,
కడగట్ల, తాడేపల్లిగూడెం.

Printed at Razan Electric Press, Kakinada.

# సత్యవాక్య

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533001

Phone : 0884-73722

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 13 మార్చి 1993 సంచిక 8


## సంపాదకీయము

### మతశాఖల మహా సభలలో గుర్తింపబడిన సంగతులు

### ( Observations of a Denominational Campaign )

ఈ మధ్య మతశాఖల మహాసభకు ఒకసారి వెళ్ళాను. వారి సభలకు ప్రోత్సాహమిచ్చుచున్నానని ఎవరు తలంచకుండు నిమిత్తం సాధారణంగా ఇటువంటిది నేను చేయను. ఈ సందర్భంలో అనేక మంది హాజరవుటవలన అదంతా ఒక పెద్ద సర్కస్ వలె కనబడింది. నేనుకూడ ఒక ప్రేక్షకుడి నయ్యాను. నేనక్కడికి వెళ్ళాను గనుక నేను గుర్తించిన కొన్ని సంగతులు మీకు తెలియజేస్తాను.

ఒక పెద్ద పట్టణంలో జరిగే మహాసభ గనుక దీని వెనుక కొన్ని పెద్ద 'సంఘాలు' ప్రోత్సాహదారులుగా యుంటారు. బోధించడానికి వచ్చేవారు ఈ మతశాఖల సంఘాలన్నిటితో ఏకీభవించాలి. ఈ మత శాఖల సంఘాలు వాటి పేరులోను, ఆర్గనైజేషన్‌లోను, బోధలోను ఇంకా ఎన్నో విధాలుగా విభజింపబడియున్నా, వారంతా కలసి ఒక

పెద్ద సభను జరిపించడానికి సహకరిస్తారు. వారా సభ జయప్రదంగా జరుగడానికి డబ్బిస్తారు, అడ్వర్టయిజ్ చేస్తారు. పనివారలను నియమిస్తారు. అదంతా జరిగిపోయిన తరువాత లాభాలనుకూడ పంచుకొంటారు, వారివారి శాఖలకు తిరిగి వెళ్ళిపోతారు.

ఈ సభలలో మాట్లాడడానికి ప్రఖ్యాతిగాంచిన ఒక వక్తను ఆహ్వానిస్తారు. అతడు, అతని అనుచరులు రాజదర్జా ననుభవిస్తారు. అట్టి వ్యక్తి వచ్చి తన పనిని స్థానికంగాను, జాతీయంగాను వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తాడు. ఈ కూటాలకు రాజకీయ నాయకులను, ప్రముఖులను ఆహ్వానిస్తారు. మరియు ఆ ఏరియాలో యున్న వివిధ మతనాయకులను కూడ ఆహ్వానిస్తారు. వారికేదో పాత్రనిస్తారు. ఇట్టి సభలకు ప్రతిరోజు, ప్రతి రాత్రి వేలాది ప్రజలు హాజరవుతారు. హాజరయ్యేవారిలో సభలను జరిపించేవారి బృందం, ఆయా సంఘాల సభ్యులు, మరియు క్రీస్తునందు విశ్వాసముగలవా రుంటారు. వారు అంతపెద్ద కూటాలకు హాజరైనందున ఒక గర్వకారణంగా దానిని గూర్చి చెబుతుంటారు. చాలమంది జరుగుచున్న దేమిటో చూద్దాం అని వచ్చినవారుంటారు. వివిధ వస్తువులు, పుస్తకాలు, తినుబండారాలు అమ్మే చిన్న చిన్న కొట్లు ఆ ప్రాంతంచుట్టు యుంటాయి. కరపత్రికలు పంచేవారు కూడ చాలమంది యుంటారు.

ఒక్కొక్క కూటము కొన్ని గంటలపాటు జరుగుతాది. ప్రార్థనలు, సాక్ష్యాలు, ఉపన్యాసాలు ఉంటాయి. చందాకూడ పడతారు. పెద్ద ఆర్కెస్ట్రాతో పాటలుపాడే గాన బృందం ఒకటి యుంటాది. చివరిగా ఒకాయన లేచి వర్తమాన మిస్తారు. ప్రేక్షకులు కొందరు కూర్చొనే యుంటారు. మరికొందరు నిలబడి యుంటారు. అంతేగాక, వచ్చి పోయే వారు వేలకొలది యుంటారు. హాజరైన వారిలో కొందరు "ప్రభువు ఆహ్వానమునకు" స్పందిస్తారు. గాని మొత్తంమీద ఈ సభలను అర్థ

నైజ్ చేసిన సంఘాలకు కలిగే ఆత్మీయ లాభం యేమీ వుండదు. ఆయా సంఘాల సభ్యులు యేమీ పెరుగరు. కొంతకాలం అయ్యేసరికి ఈ మహాసభ జరిగినట్లే యుండదు. లాభం పొందేది ముఖ్య ప్రసంగీకుడు, మరియు అతని అనుచరులును. ఈ సభలు అయిపోయిన తరువాత కూడ హాజరైన వారినుండి వారికి ఆర్థిక సహాయం అందుచునే యుంటాది. వారి పేరు ప్రఖ్యాతులు దేశమంతటా వ్యాపిస్తూనే యుంటాయి.

ఈ సభలు సాధారణంగా పెంతెకొస్తు వారి తత్వాన్ని, అభిరుచులను కలిగి యుంటాయి. అద్భుతాలు జరుగుతాయనీ, రోగులు స్వస్థత చెందుతారనీ, వారి సమస్యలకు పరిష్కారం లభిస్తాదనీ ఆశ చూపి ప్రజలను సభలకు నడిపిస్తారు. చాలమందికి తెలియని దేమిటంటే వేదికపై జరిగే స్వస్థతలు, సాక్ష్యాలు ముందుగనే ఏర్పాటు చేసికొన్నట్టివి. నిజానికి అక్కడ జరిగే అద్భుతం యేమీ వుండదు. గ్రుడ్డివారు చూపు పొందకుండా గ్రుడ్డివారిగానే తమ యిండ్లకు వెళ్ళిపోతారు. చేతులు, కాళ్ళు లేకుండా వచ్చినవారు వాటిని తిరిగి పొందకుండానే యిండ్లకు వెళ్తారు. ప్రేక్షకులు కూడ వాళ్లు వీళ్ళు యిచ్చే సాక్ష్యాలపై ఆధారపడ్తారు గాని వారు నిజంగా తమ కండ్లారా చూచిన అద్భుతం యేమీ వుండదు. మేము పరిశుద్ధాత్మ బాప్తిస్మం పొందామని అందువలననే స్వస్థతలు చేయగలుగుచున్నామని చెప్పుకొంటారు గాని మాట్లాడేటప్పుడు అనువాదకులద్వారా మాట్లాడతారు. మొదటి శతాబ్దములో పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన వారు వెంటనే యితర భాషలలో మాట్లాడ గల్గిరి (అపొ.కా. 2:4,6). ఆయితే ఈ ఆధునిక స్వస్థత వరముగల భక్తులు తర్జుమాదారు లేకుండా యేమీ చెప్పలేరు. అపొస్తలుల సందర్భములోనైతే ప్రతివాడు తన స్వభాషతో అపొస్తలులు మాట్లాడినట్లు వినగల్గిరి.

చివరిగా, ఈ మహాసభలలో క్రీస్తుయొక్క పవిత్రమైన సువార్త ఎన్నడు ప్రకటింపబడదు. చాల గందరగోళం జరుగుతాది. అనేక మంది మాట్లాడతారు, గాని సత్యం మాత్రం ప్రకటింపబడదు. రక్షింపబడే విధానం ప్రజలకు చెప్పబడదు. నమ్మి బాప్తిస్మం పొందిన వాడు రక్షింపబడునను సత్యం అక్కడ బోధింపబడదు (మార్కు 16:16). రక్షింపబడినవారిని ప్రభువే తన సంఘముతో చేర్చుకొను నని చెప్పబడదు (అపొ. కా. 2:47). దేవుని కుటుంబమే సంఘమని, క్రీస్తే సంఘమునకు రక్షకుడని, శిరస్సని, దాని పునాది యని వారు బోధింపరు (అపొ. కా. 4:12; 1 కొరింథీ 3:11; కొల 1:18; ఎఫెసీ 5:23-27). వారట్టి సత్యాలను బోధిస్తే మతశాఖలలో యుండరు. అట్టివారు అబద్ధ బోధకులు, వారు ప్రజలను తప్పుదారిన పట్టిస్తారు.

అంత పెద్ద సభలు, అన్ని వేలమంది హాజరవుట ఘనంగానే కనబడినా, మన దేశ మతస్వాతంత్ర్యం వలన అట్టిది సాధ్యమైనా, వేలకొలది ప్రజలకు సంపూర్ణ సత్యం విన్పించకుండా వట్టిగా వారిని పంపివేయడం విచారకరం. ప్రియ మిత్రులారా, విమర్శించాలనిగాని, అసూయవలనగాని ఈ మాటలు చెప్పబడుట లేదు. ప్రభువు, అపొస్తలులు అబద్ధ బోధకులను గూర్చి మనకు తరుచు హెచ్చరికలని చ్చారు. భేధములను ఆటంకములను కలుగజేయు వారిని కనిపెట్టి యుండాలని, వారినుండి తొలగిపోవాలని అపొస్తలుడైన పౌలు చెప్పాడు. అట్టివారు మన ప్రభువైన క్రీస్తుకు కాక, తమ కడుపునకే దాసులు; వారు ఇంపైన మాటల వలనను ఇచ్చకముల వలనను నిష్కపటుల మనస్సులను మోసపుచ్చుదురు (రోమా 16:17-19).

నా మాటలనే మీరు గైకొనవద్దు. ప్రభువు వాక్యాన్ని చదవండి. ఈ సభలలో విన్పించబడే దానిని లేఖనాలతో పోల్చి చూడండి. భేదమును తెలిసికొనండి. మానవకల్పిత బోధలకు, ప్రలోభాలకు

మీరు లోనవసరం లేదు. మీగతా వాళ్ళేమి చేసినా ప్రభువు వాక్యాన్ని విని, విశ్వసించి దానికి లోబడుటకు నీవు నిశ్చయించుకొంటే నీకు గొప్ప నిరీక్షణ కలదు. నన్నుగాని, ఏ మానవునిగాని వెంబడించ నవుసరం లేదు. క్రీస్తునే వెంబడించండి. మీరు క్రీస్తును వెంబడించే లాగున పై సంగతులను మీకు తెలియజేసాను. ఆయనను అనుస రిస్తేనే మీకు రక్షణ, నిరీక్షణ.

—o—

## రోమా పత్రిక - దీనత్వము
## (Humility in Romans)

పౌలుయొక్క మూడవ మిషనెరీ ప్రయాణములో గ్రీసునుండి సుమారు క్రీ॥శ॥ 60 సం॥రములో రోమాలోని క్రైస్తవులకు వ్రాయ బడిన ఉత్తరమే రోమా పత్రిక (అ. కా. 20:2-3; రోమా 16:1-2, 1 కొరింథి 1 : 14). ఈ పత్రిక యొక్క ముఖ్య సిద్ధాంతము "దీన త్వము". ఈ దీనత్వమును అనేక పర్యాయములు అనేక రీతులుగా మనము చూచుచుందుము. ఈ దిగువ నీయబడిన ఉదాహరణముల ద్వారా ఈ పత్రిక యందు వ్రాయబడిన దీనత్వమును మనము గ్రహించి, నేర్చుకొనుట ద్వారా అనేకములైన ఆత్మీయానుభవము పొందుటకు సహాయపడును.

### పౌలుయొక్క దీనత్వము
### (The Humility of Paul)

పౌలు ఒక అపొస్తలుడైనను అతడు ప్రభువైన యేసుయొక్క సేవకునిగా తనను తాను ముందుగా పరిచయము చేసికొనెను (రోమా 1:1). అతడు ఒక ప్రత్యేకమైన వర్తమానము ద్వారా పంపబడిన అపొస్తలుడు. తన్ను తాను ఘనపరచుకొనుటకు గాను యేవిధమైన బిరుదములను పెట్టుకొనలేదు. అతని వర్తమానము క్రీస్తే. పౌలు కాదు (రోమా 1:2-6; 2 కొరింథి 4:5).

పౌలు విశ్వాసమందు బహు స్థిరుడైనప్పటికిని అతడు మూర్ఖముగ లేడు. విశ్వాసమువలన ఫలితమును పొంద నాశించినవాడై రోమాలోని క్రైస్తవులను చూచుటకు పౌలు ఆశించెను (రోమా 1:12;15:24). పౌలు రోమీయుడైనప్పటికిని ప్రతి జనాంగములోని వారికిని సువార్త ప్రకటించుటకు సిద్ధముగా యుండెను (రోమా 1 : 14-15). భోజనపు బల్లనొద్ద భోజనము వడ్డించువాని రీతిగా దేవుని సువార్తను అన్యజనులకు ప్రకటించుటకుగాను ప్రభువైన యేసుక్రీస్తుకు పరిచారకుడుగ యుండెను (రోమా 15:16). పౌలు రోమా పట్టణముయొక్క పౌరసత్వము కలిగి యుండినను సువార్త ప్రకటించుటకు సిగ్గుపడక దానివిషయమై దోపివలె శిక్ష ననుభవించెను. సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతి వానికి, మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది (రోమా 1:16). గర్వము నాయకులను పాడుచేసి సంఘమునకు హాని కలుగజేయును (మత్తయి 20 : 25; 23 : 11-12; యోహాను 13 : 3-17; 1 పేతురు 5:3-6; 1 తిమోతి 3 : 6). పౌలుయొక్క దీనత్వము అనేక ఆత్మలు రక్షింపబడుటకు దోహద పడెను.

## పాపముయొక్క దీనత్వము

## ( The Humility of Sin )

తప్పిపోయిన వారిలో కొంతమంది అహంకారులు, బింకములాడువారు గలరు (రోమా 1:31). వారు జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులై యున్నారు (రోమా 1 : 22). పాపియైనవాడు, తాను గ్రుడ్డివారికి త్రోవ చూపువాడనని, చీకటిలో యుండువారికి వెలుగును, బుద్ధిహీనులకు శిక్షకుడుగను, బాలురకు ఉపాధ్యాయుడనై యున్నానని తలంచుచు చాల ధైర్యముగా యుండును. అతడు దేవుని యందును, ధర్మశాస్త్రమందును అతిశయించుచుండును (రోమా

2:17, 23). దేవుని ఆజ్ఞలను మీరుట ద్వారా అట్టివాడు దేవునికి అవమానము కలుగజేయును (2:23).

పాపులైనట్టి వారు ఏ అధికారము క్రిందనైనను తమ్మును తాము తగ్గించుకొనుచున్నట్లు నమ్మరు. పాపమునకు గాని, నీతికిగాని ఒక వ్యక్తి లోబడవలెననిన అతడు అట్లు చేయుటకు తనను తాను తగ్గించుకొనును. దేనికిని చెందక తటస్థముగ యుండుటకు తావు లేదు. (మత్తయి 12:30). లోబడుటకు దేనికి మిమ్మును మీరు దాసులుగా అప్పగించుకొందురో అది చావు నిమిత్తము పాపమునకే గాని, నీతి నిమిత్తము విధేయతకేగాని దేనికి మీరు లోబడుదురో దానికి దాసులగుదురని మీరెరుగరా? (రోమా 6:16).

సృష్టి జరిగిన తరువాత చాలమంది ప్రజలు తమ మనస్సులో దేవునికి చోటియ్యలేదు (రోమా 1:28). వారు దేవుని ఎరిగియు ఆయనను దేవునిగా మహిమ పరచలేదు, కృతజ్ఞతాస్తుతులు చెల్లింపను లేదు గాని తమ వాదముల యందు వ్యర్థులైరి (రోమా 1:21). సమస్త జీవులకు కర్తయైన వానిని పూజించుటకు బదులు మానవులచే సృష్టించబడిన ప్రతిమలకు, జంతు రూపములకు వారు పూజలు చేయుదురు. వారు అక్షయుడగు దేవుని మహిమను క్షయమగు మనుష్యుల యొక్కయు, పక్షుల యొక్కయు, చతుష్పాద జంతువుల యొక్కయు, పురుగుల యొక్కయు, ప్రతిమా స్వరూపముగా మార్చిరి (1 : 23). అట్టివారు దేవుని సత్యమును అసత్యమునకు మార్చి సృష్టికర్తకు ప్రతిగా సృష్టమును పూజించి సేవించిరి (1:25) (1 కొరింథి 10:14; 1 యోహాను 5:21; ప్రకటన 21:8; 1 థెస్సలొనిక 1:9).

తప్పు, ఒప్పులకు భేదము తెలిసిన ప్రతివారు పాపమునే ఎన్నుకొందురు గాని ప్రభువైన యేసు మాత్రము పాపము లేనివాడుగా యుండెను (హెబ్రీ 4 : 15). అపొస్తలుడైన పౌలు యిట్లు అడుగుచు

న్నాడు. "అలాగైన ఏ మందుము? మేము వారికంటె శ్రేష్ఠులమా? తక్కువవారమా ? ఎంతమాత్రమును కాము. యూదులేమి, గ్రీసుదేశస్థులేమి అందరును పాపమునకు లోనైయున్నారని యింతకుముందు దోషారోపణ చేసియున్నాము" (3 : 9). ఏ భేదమును లేదు, అందరును పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు (3 : 23).

పాపములో యుండిన వారందరూ పాపమునకు దాసులు (6:6) దుర్నీతి సాధనములు (6 : 13), అపవిత్రతకును, అక్రమమునకును దాసులు (6:19), వారు శరీరానుసారులు (8:5). గనుక శరీర విషయములందు మనసుంచుదురు. అట్టివారు మన ప్రభువైన క్రీస్తుకు కాక తమ కడుపునకే దాసులు. వారు ఇంపైన మాటలవలనను, ఇచ్ఛకముల వలనను నిష్కపటుల మనసులను మోసపుచ్చుదురు (16:18).

పాపము ఈలోక జీవితములో హాని కలిగించుట మాత్రమే గాక నిత్య శిక్షను కలుగజేయును (5 : 12-14; 2:8-9). కాబట్టి శరీర దురాశలకు లోబడునట్లుగా చావునకు లోనైన మీ శరీరమందు పాపమును ఏలనియ్యకుడి (6 : 12). ఏలయనగా పాపమువలన వచ్చు జీతము మరణము (6:23).

## రక్షణయొక్క దీనత్వము

## (The Humility of Salvation)

మనము రక్షింపబడుటకు తగినవారము కాము. మనము రక్షణను సంపాదించుకొనలేము. అయితే మన అతిశయ కారణ మెక్కడ? అది కొట్టివేయబడెను. ఎట్టి న్యాయమును బట్టి అది కొట్టివేయబడెను? క్రియా న్యాయమును బట్టియా? కాదు; విశ్వాస న్యాయమును బట్టియే (3 : 27). మనమింక బలహీనులమై యుండగా, క్రీస్తు యుక్త కాలమున భక్తిహీనుల కొరకు చనిపోయెను. అయితే దేవుడు మన

యెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు. ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను (5 : 6, 8). మనలను రక్షించుటకొరకు క్రీస్తుప్రభువు చేసిన త్యాగమునకు దీన త్వము ఎన్నో విధములుగ అవసరమై యున్నది.

సువార్తను వినుట: ఆయన మాటలు విని, వాటిని చదువుటకు మనసు కలిగియుండవలెను. వినుటవలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును (10 : 17).

సువార్తను నమ్మునట్లు :—మనము దానిని గూర్చి జాగ్ర త్తగా ఆలోచించి అది యదార్థమని నమ్మవలెను. నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును; రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును (10:10). మన పాపముల విషయమై పశ్చా త్తాప పడుటకు:- మనము పాపులమని, శిక్షకు పాత్రులమని వినయ ముతో ఒప్పుకొనవలెను. అన్ని సమయములందును దేవుడు వెంటనే పాపమునకు శిక్ష నీయడు. కొందరు ఆయన శిక్షించుటకు ఆలస్యము చేయుటను బట్టి యెన్నటికిని యిక ఆయన శిక్షించడందురు (ప్రసంగి 7:11-13; 2 పేతురు 3 : 3-4). దేవుడు పాపము నసహ్యించుకొనడని లేదా ఆయన మరచెనని లేదా వారి పాపములను గూర్చి ఆయనకు తెలియదని లేక వారు చేయునదంతయు ఆయన అంగీకరించునని వారు చెప్పుదురు. ఆయన శిక్షను ఆలస్యముచేయుట ద్వారా అనవసరమైన పశ్చాత్తాపము కలుగజేయునని తలంచరు. దేవుని అనుగ్రహము మారుమనస్సు పొందుటకు నిన్ను ప్రేరేపించుచున్నదని యెరుగక, ఆయన అనుగ్రహైశ్వర్యమును, సహనమును, దీర్ఘ శాంతమును తృణీకరించుదువా? (2 : 4; 2 పేతురు 3:9-10; ప్రసంగి 12:13-14; అ. కా. 17:30-31).

దేవుడు మంచివారికిని, చెడ్డవారికిని కూడ పొందదగిన దాని

కంటె అధికముగా దీవెనలను అనుగ్రహించును (మత్తయి 5 : 45; అ.కా. 14 : 17; 17 : 25, 28). ఒక దినము లేక ఒక ఘడియ కూడ దేవుడు మనకు ఇచ్చియుండలేదు. మన ప్రతి ఊపిరి కూడ ఆయన దీవెనయే. వారు మంచివారు అయినందువలననే దేవుని దీవెనలు వారికి కలుగుచున్నవని, వారు పరలోక రాజ్యములో ప్రవేశింతురని కొంతమంది తలంచెదరు. అయితే ఈలోకములో మనము జీవించుచున్నపుడు ఆయనద్వారా కలిగే దీవెనలుగాని శిక్షించుటలో ఆయన చేయు ఆలస్యముగాని మన మంచితనమును బట్టి కాదుగాని ఆయన మంచివాడైనందు వలననే అట్లు జరుగుచున్నది. దానికి ప్రతిఫలముగా నీవు ఆయన యెడల మంచితనముగ యుందువా? పశ్చాత్తాపమనేది దేవునియొక్క మంచితనమునకు ప్రతిస్పందించి పాప జీవితమునుండి దేవుని నీతి జీవితమునకు మరలుటకొరకు వినయముతో తీసికొనబడిన నిశ్చయతయై యున్నది.

**ఒప్పుకొనుటకు:-** యేసుక్రీస్తు దేవుని కుమారుడని బహిరంగముగ ఒప్పుకొనవలెను (మత్తయి 10:32-33; 16:16; అ.కా. 8:37, ఫిలిప్పీ 2:9-11). యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల, నీవు రక్షింపబడుదువు (10:9). నీ జీవితములో ఆయన అధికారమునకు ఒప్పుకొంటివన్నమాట. క్రీస్తును ఒప్పుకొనుట రక్షణకు మెట్టు. నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును. రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును (10 : 10). ఆయనకు విధేయులు కాకుండా ప్రభువా అని పిలిచినంత మాత్రమున సరిపోదు (మత్తయి 7:21-23; లూకా 6:46-49).

**బాప్తిస్మము పొందుటకు :-** బాప్తిస్మము దీనత్వముతో కూడుకొనినది. యేసుక్రీస్తు యొక్క సమాధిని పోలినట్టిది బాప్తి

స్మము. పాపి తన పాపపరిహారము కొరకు నీటిలో ముంచబడును. అనగా సమాధి చేయబడును (అ. కా. 2 : 38; 22 : 16, మార్కు 16:15-16). బాప్తిస్మముద్వారా పాపి యేసుక్రీస్తులోనికి బాప్తిస్మము పొందును. క్రీస్తు యేసునందున్న వారికి శిక్షావిధియు లేదు (8:1) (ఎఫెసి 1:3). బాప్తిస్మముద్వారా పాపి యేసుక్రీస్తుయొక్క మరణము లోనికి బాప్తిస్మము పొందును, మన పాపముల నిమిత్తమై ఆయన రక్తమును ధారపోసిన సిలువ శ్రమలలో పాలివాడగును. క్రీస్తు యేసు లోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతి పెట్టబడితిమి. మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగలవారమైన యెడల, ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఆయనతో ఐక్యము గలవారమై యుందుము. ఏమనగా మనమింకను పాపమునకు దాసులము కాకుండుటకు పాపశరీరము నిరర్థకమగునట్లు, మన ప్రాచీన స్వభావము ఆయనతోకూడ సిలువ వేయబడెనని యెరుగుదుము (6:3-6).

సువార్తకు విధేయులగుట: అనగా క్రీస్తు ప్రభువు యొక్క చిత్తమునకు అప్పగించుకొనుట. అది విశ్వాసమునకు విధేయతను కలిగియుండును (1:5; 16:26). రక్షింపబడుటకు సువార్తకు విధేయులగుట అవసరమని పౌలు చెప్పుచున్నాడు. మీరు పాపమునకు దాసులై యుంటిరి గాని యే ఉపదేశక్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయపూర్వకముగ లోబడినవారై, పాపము నుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి (6:17-18; 10:16; 2:18). విశ్వాసముద్వారా క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన పాపి

రక్షింపబడుదుము. దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసు నందు నిత్యజీవము (6:23).

## క్రైస్తవ జీవితములో దీనత్వము
## ( Humility in Christian Living )

**దేవుని యెడల దీనత్వము :** క్రైస్తవులైన వారికి ఈదిగువ విషయము జ్ఞాపకము చేయవలసిన అవసరత యున్నది. అదేమనగా "మృతులలోనుండి సజీవులమనుకొని మిమ్మును మీరే దేవునికి అప్పగించుకొనుడి. మీ అవయవములను నీతిసాధనములుగా దేవునికి అప్పగించండి" (6:13; 6:22). కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమునుబట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది (12 : 1).

**క్రీస్తుయెడల దీనత్వము :** ఎందుచేతననగా క్రైస్తవులైన వారు క్రీస్తులోయున్నవారు గనుక పాపము వారికి తగిన వస్త్రము కాదు. కాబట్టి అంధకార క్రియలను విసర్జించి, తేజస్సంబంధమైన యుద్ధోపకరణములను ధరించుకొందము (13 : 12). ప్రభువైన యేసు క్రీస్తును ధరించుకొనినవారై శరీరేచ్ఛలను నెరవేర్చుకొనుటకు శరీర విషయమై ఆలోచన చేసికొనకుడి. ఆయనవలె జీవించుడి. ఆయన మనలను విమోచించెను గనుక (13 : 14) మనము ఆయన వారము (14:8). మనము పిల్లలమైతే వారసులము, అనగా దేవుని వారసులము; క్రీస్తుతోకూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమ పడినయెడల, క్రీస్తు తోడి వారసులము (8:17).

**దేవుని వాక్యము యెడల దీనత్వము :** క్రైస్తవులు దేవుని ఆత్మ చేత నడిపింపబడుదురు (8 : 14). శరీరానుసారులు శరీర విషయ

షయులమీద మనస్సుంతురు. ఆత్మానుసారులు ఆత్మవిషయముల మీద మనస్సునుంతురు (8:5). క్రీస్తు సువార్త యందు పరిశుద్ధాత్మ ద్వారా వ్రాయబడిన విషయము: "విశ్వాస మూలముగా అంతకంతకు విశ్వాసము కలుగునట్లు దేవుని నీతి దానియందు బయలుపరచబడు చున్నది. (1:17) నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును (ఎఫెసి 3:3-5; 6 : 17). మొదటి శతాబ్దములోనే పరిశుద్ధాత్ముడు దేవుని యొక్కయు, ప్రభుసైన యేసుక్రీస్తు యొక్కయు చిత్తమును పూర్తిగ బయలుపరచుటకు మానెను (యోహాను 16:12-13; 2 పేతురు 1:3, యూదా :3 ; 2 యోహాను : 9). బైబిలు చదువుట ద్వారా మన హృదయము లోనికి దేవుని వాక్యము ప్రవేశించును. అప్పుడు మన జీవితములను శారీరక విషయములకు గాక దేవుని సువార్త విషయములను మనస్కరించి క్రీస్తువలె జీవించుదుము. మీరు ఈలోక మర్యాద ననుసరింపక, ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునై యున్న దేవుని చిత్త మేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుట వలన రూపాంతరము పొందుడి (12:2).

**సహోదరుల యెడల దీనత్వము :** భక్తియు, నిష్ఠయు గలిగిన క్రైస్తవులు సహితము తన తోటి క్రైస్తవుని చిన్న చూపు చూచునట్లు కొన్నిసార్లు శోధింపబడుదురు. అయితే పౌలు ప్రతి క్రైస్తవునికి ఈ విధముగ చెప్పుచున్నాడు. "తన్ను తాను ఎంచుకొన దగిన దానికంటె ఎక్కువగా ఎంచుకొనక, దేవుడు ఒక్కొక్కనికి విభజించి యిచ్చిన విశ్వాస పరిమాణ ప్రకారము, తాను స్వస్థబుద్ధిగలవాడగుటకై తగిన రీతిగా తన్ను ఎంచుకొనవలెనని, నాకు అనుగ్రహింపబడిన కృపను బట్టి మీలో నున్న ప్రతివానితోను చెప్పుచున్నాను. ఒక్క శరీరములో మనకు అనేక అవయవము లుండినను, అవయవము లన్నిటికిని ఒక్కటే పని యేలాగు ఉండదో, ఆలాగే అనేకుల మైన మనము క్రీస్తులో ఒక్క శరీరముగా యుండి, ఒకరి కొకరము

ప్రత్యేకముగా అవయవములమై యున్నాము (12:3-5). ప్రతి కృపా వరమును మన దేవుని నుండి కలిగినదే. కనుక సంఘమంతయు క్షేమాభివృద్ధి పొందునట్లు ఒక్కొక్కరికి వేర్వేరు కృపావరము లీయబడినవి (1 కొరింథి 12:12-31; ఎఫెసి 4:16). సహోదర ప్రేమ విషయములో ఒకనియం దొకడు అనురాగముగలవారై, ఘనత విషయములో ఒకని నొకడు గొప్పగా ఎంచుకొనుడి (12:10).

క్రైస్తవులలో కొంతమంది యెడల పక్షపాతము కలిగి యుండ రాదు. ఒకనితో ఒకడు మనస్సు కలిగి యుండుడి. హెచ్చువాటి యందు మనస్సుంచక తగ్గువాటియందు ఆసక్తులై యుండుడి. మీకు మీరే బుద్ధిమంతులమని అనుకొనవద్దు (12 : 16). విశ్వాస విషయ మందు బలవంతులమని తలంచినయెడల ఓర్పు కలిగి విశ్వాస విషయములో బలహీనుడైన వానిని చేర్చుకొనుడి (14:1). బలవంతులమైన మనము, మనలను మనమే సంతోషపరచుకొనక, బలహీనుల దౌర్బల్యములను భరించుటకు బద్ధులమై యున్నాము. తన పొరుగువారికి క్షేమాభివృద్ధి కలుగునట్లు మనలో ప్రతివాడును మేలైన దానియందు అతనిని సంతోష పరచవలెను. క్రీస్తుకూడ తన్ను తాను సంతోష పరచుకొనలేదు (15 : 1-3). క్రీస్తు యెల్లప్పుడు దేవునికి విధేయుడై ఇతరులకు కష్టము కలిగించు స్వార్థపరమైన క్రియ లేమియు చేయలేదు.

## ప్రభుత్వము యెడల దీనత్వము

**( Humility toward Government )**

ప్రతివాడును పై అధికారులకు లోబడి యుండవలెను; ఏలయనగా దేవునివలన కలిగినది తప్ప మరి యే అధికారము లేదు; ఉన్న అధికారములు దేవునివలననే నియమింపబడి యున్నవి (13 : 1), కాబట్టి యెవనికి పన్నో వానికి పన్నును, ఎవనికి సుంకమో వానికి

సుంకమును చెల్లించుడి. ఎవనియెడల భయముండవలెనో వానియెడల భయమును, యెవనియెడల సన్మానముండవలెనో వానియెడల సన్మానమును కలిగియుండి, అందరికిని వారివారి ఋణములు తీర్చుడి (13:7).

## శత్రువుల యెడల దీనత్వము

### (Humility toward Enemies)

చెడ్డవారికి విధేయులగుట ద్వారా మనము దేవునికి అవిధేయులము కాకూడదు. మరియు అట్టి వారిపై పగతీర్చుకొనుట ద్వారా వారు దేవునికి అవిధేయులు కాకుండునట్లు చూడవలెను. మిమ్మును హింసించు వారిని దీవించుడి. దీవించుడి గాని శపింపవద్దు (12 :14). కీడుకు ప్రతికీడు యెవనికిని చేయవద్దు (12:17). శక్యమైతే మీ చేతనైనంత మట్టుకు సమస్త మనుష్యులతో సమాధానముగా యుండుడి. ప్రియులారా, మీకు మీరే పగ తీర్చుకొనక, దేవుని ఉగ్రతకు చోటియ్యుడి - పగ తీర్చుట నా పని, నేనే ప్రతిఫలము నిత్తును అని ప్రభువు చెప్పుచున్నాడని వ్రాయబడి యున్నది. కాబట్టి, నీ శత్రువు ఆకలిగొనియుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొనియుంటే దాహమిమ్ము, ఆలాగు చేయుటవలన అతని తలమీద నిప్పులు కుప్పగా పోయుదువు. కీడు వలన జయించబడక, మేలుచేత కీడును జయించుము (12 : 18-21).

నీవు దేవునికి వినయముతో సమర్పించుకొంటివా ? నీవు ఎప్పటికిని ఆలస్యము చేయవద్దు. మనమందరము దేవుని న్యాయపీఠము యెదుట నిలుతుము. నాతోడు, ప్రతి మోకాలును నా యెదుట వంగును ప్రతి నాలుకయు దేవుని స్తుతించును అని ప్రభువు చెప్పుచున్నాడు. గనుక మనలో ప్రతివాడును తన్ను గురించి దేవునికి లెక్క యొప్పగింపవలెను (14 : 10-12). నీవు, నేను వినయముతో దేవుని ముందు వంగుదము. నీవు ఈ భూమిమీద ఉండగనే నిన్ను నీవు

దేవునికి సమర్పించుకొనని. మొదల అది చాల అలస్యమై పోవును. ఈ దినమే నీవు దేవుని సువార్తను యెందుకు విధేయుడవు కాకూడదు?

—రోయస్ ఫ్రెడరిక్.

—o—

## ప్రతి సంఘములోను పెద్దలు నియమింపబడుట

(Elders in Every Church)

"ప్రతి సంఘములో వారికి పెద్దలను నియమించి ఉపవాసముండి, ప్రార్థన చేసి, వారు నమ్మిన ప్రభువునకు వారిని అప్పగించిరి" (అపొ.కా. 14:23).

**ఆత్మ సంబంధముగా సంఘనిర్వహణ :** మన ప్రభువు పునరుత్థానుడైన పిదప కొంత కాలమునకు సంఘములో పెద్దలు యేర్పర్చబడిరి. అపొ. 11 : 30; 15:2, 4, 6, 22, 16:4, 21:17, 18 చదువండి. మిగిలిన సంఘములు కూడ కొంతకాలమునకు యీ క్రమమునే అనుసరించిరి అకా. 14:23.

**స్థానిక సంఘ నిర్వహణ: (Local Church organisation)** ప్రతి సంఘములోను పెద్దలు ఒకరికంటె అధికముగా ఉండిరి. అ. కా. 11 : 30, 14 : 23, 20 : 17, ఫిలిప్పీ 1:1 సంఘములో పెద్దలు యేర్పరచబడలేకపోతే, ఆ సంఘము పూర్తికాలేదని భావము. తీతు 1:5, అపొ.కార్య. 20:17, తీతు 1:6 లో చూచినచో పెద్దలు అనగా వయస్సులోను అనుభవ జ్ఞానములోను మెదిగిన వారని భావము. గ్రీకు భాషలో "ప్రెస్బిటరోస్" అందురు. గ్రీకు భాషలో ఎపిస్కోపోస్ (అ.కా. 20 : 28, 1 తిమోతి 3:1). వారున్న సంఘములో వారు మందను కాయువారై యున్నారు. "పోయ్‌మెన్" అనగా సంఘమును పైనుండి చూచువారు, పర్యవేక్షకులు. మతశాఖలలో పాస్టర్లు అను మాటకు వేర్వేరు భావములు కలవు. నూతన

నిబంధన సంఘములో దాని భావము, సంఘమును కాయువారు అని భావము. సంఘములపై అధికారిగా, కాపరిగా బిషప్పులు నియమింప బడుట నూతన నిబంధన విధానము కాదు. వాక్యమునకు విరుద్ధము. ఒకే పాస్టరు గలిగియుండుట కూడ సంఘములో విధానముకాదు. పడుచువారు, విశ్వాసులు గల బిడ్డలు లేనివారు సంఘ పెద్దలుగా ఉండరాదు, సంఘములో పెద్దలతో పాటు సంఘ పరిచర్య నెరవేర్చుటకు "పరిచారకులు" ఉండవలయును. ఫిలిప్పీ 1:1, 1 తిమో 3:8-13. ప్రతి సంఘములోను సామర్థ్యమగు సంఘ నిర్వహణ ప్రభువు నియమించిన విధానముగా మనము గుర్తింప వలయును.

మన ప్రభువైన యేసు ప్రధాన గొర్రెల కాపరిగా యున్నాడని 1 పేతురు 5 : 4 లో చూచుచున్నాము. సంఘ పెద్దలు సంఘమును పర్యవేక్షించు వారుగా ఉన్నారు. 1 పేతురు 5:2, మరియు ప్రతి సభ్యుడును ఒకరికొకరు క్షేమాభివృద్ధి కలుగజేయువాడై యుండవలెను. 1 కొరి 12:25. ప్రభువు మనకు అనుగ్రహించిన కృపావరము కొలది ప్రతి సభ్యుడును సంఘములో తన వంతును నిర్వహించవలెను. (ఎఫెసీ 4:6 రోమా 12.3-8, 1 పేతురు 4:10-11).

## మనము నేర్చుకొనవలసిన పాఠములు

మనము 1 తిమోతీ 3 : 1-7, తీతు 1 : 5-9 సరిగా చదివిన యెడల, అనుభవము, జ్ఞానములేని వారిని సంఘ పెద్దలను చానియుండుచుట సంఘమునకు ప్రమాదకరమని గ్రహించవలెను. తాను హితబోధ విషయములో జనులను హెచ్చరించుటకును, యెదురాడు వారి మాటను ఖండించుటకును శక్తిగలవాడగునట్లు ఉపదేశమును అనుసరించి నమ్మదగిన బోధను గట్టిగా చేపట్టువాడునై యుండవలెను. తీతు 1:9. వారి ఆత్మీయమైన యోగ్యతలు పూర్తికాని యెడల వారు పెద్దలుగా ఉండుటకు తగి ఉండరు. అపొ. 20 : 28-31. మనుష్యుల

పారంపర్యాచారములకు గత కాలమునకు లోబడియున్న మతశాఖల లోని ఆచార కార్యకాండములకు దాసులైనవారు అట్టి ఆచారముల నుండి పూర్తిగ తెగతెంపులు చేసుకొనవలెను. వాక్యమునందు పూర్ణ అనుభవముకలవారై యుండి, బలమైన గొర్రెల కాపరులుగా ఉండనివారైతే, మతశాఖలవారితో రాజీ పడి తప్పుడు పద్దతులను, సిద్ధాంతములను అనుసరించువారుగా ఉందురు. 1 పేతురు 5 : 2. మన ప్రభువు ఉపదేశించిన వాక్యమును నమ్మకముగా గట్టి పట్టుగలిగిన వారై యుండవలెను. ప్రతి క్రైస్తవుడును తనమట్టుకు తాను దేవుని కృపయందును, ప్రభువైన యేసునుగూర్చిన జ్ఞానమునందును ఎదుగునట్లు హెచ్చరించువారై యుండినట్లు చూడవలెను. 2 పేతురు 3:18. క్రైస్తవులైన ప్రతివారును, సంఘములో పెద్దలుగను, పరిచారకులుగను ఉండుటకు యోగ్యత కలిగి యుండుటకు గురి కలిగి 2 పేతురు 3:18 యుండవలెను 1 పేతురు 5:2.

## సంఘ పెద్దలను ఎంచుకొనుట

సంఘపు పెద్దలుగా నుండుటకు యోగ్యతలు కలిగిన వారిని ప్రార్థన పూర్వకముగా ఆలోచించి తగిన యోగ్యతలు ఉన్నవో లేవో ఆలోచనా పూర్వకముగా నిర్ణయించవలెను. 1 తిమోతి 3వ అధ్యాయములోను, తీతు పత్రిక 1వ అధ్యాయములోను పెద్దల నియామకము యొక్క ఆవశ్యకతను మనము చూచుచున్నాము. పరిశుద్ధాత్ముడు సూచించిన యోగ్యతలు వారిలో కలవో లేవో మనము పరిశీలనగా ఆలోచించవలెను. వృద్ధాప్యంలో గౌరవించుటకు మనుష్యులను పెద్దలనుగా నియమించుట యోగ్యముకాదు. తమ జీవితమంతటిలో పెద్దలుగా ఉండువారు సంఘములో బహుగా కష్టపడి పనిచేయువారై యుండవలెను. అ. కా. 20 : 28-35, 1 థెస్స 5:12, హెబ్రీ 13 : 17, మరియు సంఘములో పెద్దలుగా పనిచేయ నిర్ణయ

మైన వారిలో యేదోషము కనిపించకపోదు. వారు పరిపూర్ణులు కారు: ముఖ్యముగా స్వచ్ఛమను సిద్ధాంతమును ఓపికగా బోధించువారై యుండవలెను. 1 తిమో 3:2, తీతు 1:9. తాను హితబోధ విషయములో జనులను హెచ్చరించువాడును, యెదురాడువారి మాట ఖండించు వాడునై యుండవలెను. కొందరు, ఇతరులకంటె బోధించుట యందును, ఉపదేశించుట యందును యోగ్యులై యుందురు. 1 తిమో 5 : 17. పెద్దలైనవారు దైవ పరిచర్యలో యెదుగువారై యుండవలెను. సంఘ పెద్దలుగా నియమింపబడిన వారుకూడా యితరులవలె, జ్ఞానము లోను, అనుభవములోను యెదుగువారై యుండవలెను. వారు నమ్మకమైన దేవునికిని, ఆయన కృపావాక్యమునకును అప్పగింప బడినవారై సంఘ పరిచర్య కొనసాగింప వలెను. అపో.కా. 20:32, పరిశుద్ధాత్ముడు నియమించిన ప్రమాణములకు మించిన ప్రమాణ ములను మనము నియమించరాదు. దేవుని సంఘమును కాయుటకు తగిన యోగ్యత వారిలో ఉన్నదో లేదో చూడవలెను.

ఆది సంఘములోని పెద్దలు వాక్యపరిచర్య చేయుటకు బదులు, అక్కరలోనున్న వారికి పరిచర్య చేయుటకు ప్రాధాన్యత నియ్య కూడదని తలంచిరి. అపో. 6 : 1-6, వాక్యపరిచర్యను ప్రార్థనను సంఘము నిర్లక్ష్యపెట్టరాదు. అందుచేత పరిశుద్ధాతోను జ్ఞానము తోను నిండుకొనిన యేడుగురు మనుష్యులను వారు యెంచుకొన నిర్ణయించుకొనిరి, సంఘమంతయు దేవుని నడిపింపు కొరకు ప్రార్థనలో కనిపెట్టిరి. అ.కా. 6:5,

ఉదాహరణగా: అప్పుడు సహోదరులలో ముఖ్యులైన బర్సబ్బా అను మారుపేరుగల యూదాను, సీలను తమలో యేర్పరచుకొని, పౌలుతోను బర్నబాతోను అంతియొకయకు పంపుటకు యుక్తమని, అపొస్తలులకును, పెద్దలకును, సంఘమంతటికిని తోచెను. అపో.. కా.

15 : 22, ఈలాగున సంఘమంతయు కలసి ముఖ్యమైన నిర్ణయమును చేయుట యోగ్యమైన విషయము. పరిశుద్ధాత్ముని నిర్ణయమును గమనింపవలెను. 15 : 22.

K. జీవానందం, అనకాపల్లి.

— o —

## వ్యభిచారమందు పట్టుబడిన స్త్రీ

(యోహాను 8 : 1-11)

ప్రభువైన యేసు రాత్రి ఒలీవల కొండకు వెళ్లి ఉదయాన తిరిగి దేవాలయములో బోధిస్తుండగా ఆనాటి యూదా మతనాయకులైన శాస్త్రిలు, పరిసయ్యులు ప్రభువుమీద నేరం మోపి ఆయనను శోధించుటకు ఒక జారస్త్రీని పట్టుకొని వచ్చిరి. ఈ స్త్రీ పేరు బైబిలులో దాఖలుచేయబడలేదు గాని ఈమె యూదురాలా అనుటలో ఏసందేహం లేదు (యోహాను 4:7).

ఒలీవల కొండకును యెరూషలేమునకు నడవదగినంత సమీపము ఈ సంఘటన యెరూషలేమునందు జరిగెను (యోహాను 8:1-2) (అపో.కా. 1:12). ఈ స్త్రీని తోడుకొని వచ్చి ప్రభువునొద్ద నిలువబెట్టి సంభాషించిన విషయాలు తెలిసినవే. యూదు మతాధికారులు క్రీస్తును ప్రభువుగా అంగీకరించలేదు గనుకనే ఆయనను శోధిస్తున్నారు. ధర్మశాస్త్ర చట్ట ప్రకారం ప్రభువును శోధించకూడదని వ్రాయబడి యున్నది. (ద్వితి 6:16). ప్రభువు అను మాటకు పరిపాలకుడని అర్థం.

వీరి చట్టప్రకారం పాపముచేసిన పురుషుడు, స్త్రీ ఇద్దరు తేబడాలి (ద్వితి 22:22). తద్వారా విచారణ చేసి ధర్మశాస్త్రానుసారంగా శిక్ష విధించాలి (ద్వితి 17 : 1-7). అందుచే వచ్చినవారి ఉద్దేశమే తప్పు. ఆయన యెదట నిలువబడి యున్న వారందరిని గూర్చి ప్రభువు

నకు బాగా తెలుసు! ఎట్లనగా? యేసు అందరినీ ఎరిగినవారు. ప్రత్యేకంగా మనుష్యుని అంతర్యము తెలుసుకాబట్టి మనుష్యులను గూర్చి సాక్ష్య మక్కర్లేదు (యోహాను 2:24-25). పరిసయ్యులు శాస్త్రిలు తమ కంటిలో దూలము నెంచక ఎదుటివారిలో నున్న నలుసును చూపిస్తున్నారు (మత్తయి 7 : 3). ధర్మశాస్త్రమును ఎదుటివారికి బోధిస్తారు. కాని తమకు తాము బోధించుకోరు (రోమా 2 : 21). ఎదుటి వారికి నీతిమంతులుగా అగుపడుదురు గాని లోలోపల వేషధారణతోను అక్రమముతోను నిండియున్నారు (మత్తయి 23:28).

యేసు వంగి నేలమీద వ్రేలితో ఏమో వ్రాయుచుండెను. ఆ వ్రాతనుగూర్చి క్రీస్తుకు తప్ప ఎవరికి తెలియదు. పట్టువదలక స్త్రీ విషయమై అడుగుటవలన యేసు మీలో పాపలేనివాడు మొట్టమొదట ఆమె మీద రాయి వేయవచ్చునని చెప్పెను. అయితే ఎవ్వరు ఆపని చేయక వెళ్లిపోయిరి. కారణం? నీతిమంతు డొక్కడును లేడు అందరును పాపముచేసినవారే (రోమా 3:23). ధర్మశాస్త్రిన్ని బట్టి ప్రభువు శిక్షించుటకు రాలేదు గాని దానిని నెరవేర్చుటకును (మత్తయి 5:17). పాపులను రక్షించుట కొరకే ఆయన శరీరరుడుగా ప్రత్యక్షమాయెను (మత్తయి 9 : 13). 1 తిమోతి 1 : 15) (లూకా 19 : 10).

పాపం చేసిన స్త్రీని ప్రభువు పిలిచిన విధము చూడు. యేసు ఆమెతో అమ్మా ఎవరును నీకు శిక్ష విధించలేదా? అని అడుగగా లేదు ప్రభువా అనెను. నేనును నీకు శిక్ష విధించను ఇకను పాపము చేయకుమని చెప్పి ఆమె పాపములు క్షమించెను. ఎందుకంటే భూమి మీద పాపములు క్షమించుటకు ఆయనకు అధికారము కలదు (మార్కు 2 : 10). యేసు అను పేరునకు రక్షకుడనే అర్థం ఎంత బాంగుదో కదా!

యెంత ఘోర పాపినైనా దేవుడు క్షమించును. అట్టివారు రక్షణ సువార్తను విని మారుమనస్సు పొంది యేసు దేవుని కుమారుడని ఒప్పుకొని పాపక్షమాపణ కొరకై నమ్మి బాప్తిస్మము పొందిన యెడల అట్టివారు రక్షింపబడుదురు, నమ్మనివారికి శిక్ష విధించబడును (రోమా 1:16; మార్కు 16:15-16). ప్రభువు 2 వేల సంవత్సరముల క్రితము పాపులను రక్షించుటకు వచ్చెను (1 తిమోతి 3:16). మహా ప్రభుని రెండవ రాకడైతే దేవున్ని ఎరుగని వారికిని క్రీస్తు సువార్తకు లోబడనివారికిని ప్రతి దండన చేయుటకు పరిశుద్ధుల పరివారముతో శీఘ్రముగా వస్తున్నాడు (2 థెస్స 1 : 6-8). ఇంత గొప్ప రక్షణను నిర్లక్ష్యము చేస్తే ఏలాగు తప్పించుకొంటావు (హెబ్రీ 2 : 3).

—**G.P.** రత్న కుమారి,<br>
ఆదిశేషనగర్, మద్రాసు 600 012.

—o—

## సంక్షిప్త వార్తలు

ఫిబ్రవరి 6వ తేదీ ఉదయం ర్యాలి గ్రామంలో నిర్మించబడిన క్రీస్తు సంఘాలయం ఆయన సేవార్థమై తెరువబడెను. ఆ సభలో కొందరు అమెరికా సోదరులు, భారతీయ సోదరులు పాల్గొనిరి. సోదరులు జాషువా గూటంగారు ఈ సభలో సతీసమేతంగా పాల్గొని వాక్యము నందించిరి.

ఫిబ్రవరి 14 నుండి 16 వరకు మద్రాసులోని నేషనల్ బైబిల్ కాలేజీ ఆధ్వర్యమున చక్కటి లెక్చర్‌షిప్ నిర్వహించ బడెను. దీనిలో 7 లేక 8 మంది అమెరికా సోదరులు, పలువురు భారతీయ సోదరులు పాల్గొనిరి. వాక్యము నందించిరి. 15వ తేదీనాడు **"How to be an Example before an erring brother"** అను అంశముపై సోదరులు జాషువా గూటంగారు చక్కటి ప్రసంగాన్ని చేసెరి.

సభకు విచ్చేసిన వారందరు దేవుని వాక్యములోని మాధుర్యాన్ని గ్రహించి ముగ్ధులైరి, దేవుని స్తుతించిరి. ఏటేటా జరుగుచున్న ఈ లెక్చర్‌షిప్ అంతా ఆంగ్లములోనే నిర్వహించబడెను. 11 రాష్ట్రాల నుండి వచ్చిన క్రీస్తు సంఘ సభ్యులు వచ్చి ఇందులో పాల్గొనుట ముదావహం.

ఫిబ్రవరి నెల సువార్తికుల సదస్సు మరియు సువార్త కూటము 22వ తేదీన కరుగోరుమిల్లిలో (ప॥గో॥ జిల్లా) అత్యంత ఆసక్తి దాయకంగాను ఆశీర్వాదకరంగాను జరిగెను. ఆయా ప్రాంతాలలో క్రీస్తును గూర్చిన జ్ఞానముయొక్క సువాసనను వెదజల్లుచు, ఆయన మహిమాన్వితమైన రక్షణ సంకల్పమును ప్రకటించుచున్న సువార్తికుల సమక్షంలో "మానవుడు రక్షింపబడుటకు విశ్వాసము ఒక్కటి మాత్రమే చాలునా ?" అను అంశము చర్చింపబడెను.

ఉదయం ప్రారంభమైన సమావేశమునకు సోదరులు జి. ప్రషక్ గారు (పాలకొల్లు) అధ్యక్షత వహించగా సోదరులు కె. ప్రసాద్‌గారు (ఆచంట) చర్చను ప్రారంభించిరి. సోదరులు యన్. కృష్ణమూర్తి గారు (గంటి), డి. శ్రీరాములుగారు (ములపర్రు), వి. సమూయేలు గారు (ఆచంట) చర్చలో పాల్గొనిరి. మధ్యాహ్న సమావేశమునకు సోదరులు యన్. ఏలీయాగారు (దేవగుప్తం) అధ్యక్షత వహించగా సోదరులు T.Ch ఫ్లెమింగ్స్ గారు (పెద్దాపురం), ఇ.కె.వి. ప్రసాదరావుగారు, బి. సుధాకర్‌గారు (కాకినాడ), పాల్ గూటంగారు మరియు జాషువా గూటంగారు ఈ అంశముపై చక్కని సందేశమిచ్చిరి.

విశ్వాసము యొక్క ప్రారంభమును గూర్చి రోమా 10:17 బోధించుచున్నది. "వినుటవలన విశ్వాసము కలుగును" మానవుడు రక్షింపబడుటకు విశ్వాసము అవసరమని లేఖనములు స్పష్టముగ బోధించుచున్నవి (హెబ్రీ 11 : 6). ఈ ప్రశ్నను చర్చించడానికి

కారణమేమంటే అనేకులు "విశ్వాసము మాత్రమే" (faith only) రక్షించునని బోధించుచున్నారు. దేవుని వాక్యమైతే ఆలాగున బోధించుటలేదు. ఈ అబద్ధ సిద్ధాంతమును రోమన్ కేథలికులు ప్రవేశ పెట్టగా దిద్దుబాటు ఉద్యమములో ఇది సరిచేయబడలేదు. మిగిలిన కొన్ని అబద్ధ సిద్ధాంతాలతో బాటు ఇదికూడ ప్రొటెస్టాంటు సంఘములలో స్థానాన్ని సంపాదించుకొన్నది. "వారు బాంబులతో యుద్ధముచేసిరి. వారు బాంబులతో మాత్రమే యుద్ధము చేసిరి". ఈ రెండు విషయాలలో నున్న వ్యత్యాసమును గమనించండి. ఈ రెండు ఒక్కటి కాదు. విశ్వాసము మాత్రమే మానవుని రక్షిస్తే, మారుమనస్సు ఒప్పుకొనుట, బాప్తిస్మము అవసరం లేదని అర్థం కాదా! లేఖనములను పరిశీలించండి. "నీ వాక్య సారాంశము సత్యము" (కీర్త 119 : 160).

సోదరులు పాల్ గూటంగారు మాటలాడుచు "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16 : 16). "నమ్మనివానికి బాప్తిసము పొందని వానికి అని వ్రాయబడలేదుకదా!" అని కొందరు అనవచ్చును. ఎవరైతే ఈ సంకల్పమును నమ్మలేదో వానికి శిక్ష విధింపబడునని దీని భావము. అనేకులకు క్రీస్తు కావాలి. క్రీస్తు చెప్పిన మాటలు అవసరంలేదు. యాకోబు వ్రాసిన పత్రికలో ఈ అబద్ధ సిద్ధాంతమును ఖడించుచున్నది. "దయ్యములు నమ్మి వణకుచున్నవి, వ్యర్థుడా, క్రియలులేని విశ్వాసము నిష్ఫలమైనదని తెలిసికొనగోరుచున్నావా ?" ఇది మేముకాదు యాకోబు మిమ్ములను అడుగుచున్న ప్రశ్న (యాకోబు 2:19-20). విశ్వాస సంబంధమైన క్రియలు అవే మారుమనస్సు, ఒప్పుకొనుట, బాప్తిస్మము. "నమ్ముట మంచిదే" (యాకో 2 : 19). విశ్వాసము మరణమువరకు కలిగియుండాలి అని

చెప్పిరి. జాషువా గూటంగారు మాట్లాడుచు, "దేవుడు రక్షించును, యేసు రక్షించును, విశ్వాసము రక్షించును, మారుమనస్సు రక్షించును, ఒప్పుకొనుట రక్షించును, బాప్తిస్మము రక్షించును, విధేయత రక్షించును, కృప రక్షించును, మరియు క్రీస్తు రక్తము రక్షించును. అన్నిటికి వాక్యాధారముల నిచ్చిరి. గుడ్డివాడు లోబడినప్పుడే అతడి కన్నులు తెరువబడెను" అని చక్కని సందేశ మిచ్చిరి.

సువార్త దండయాత్ర అనంతరము 8 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. రాత్రి కూటమునకు ఇ.కె.వి. ప్రసాదరావు గారు అధ్యక్షత వహించగా సోదరులు జి. షడ్రక్ గారు మరియు T. ఫ్లెమింగ్స్‌గారు సువార్త నందించిరి. కూటము అనేక హృదయాలకు ఆనందము కలుగజేసెను. కరుగోరుమిల్లిలో N. మోజెస్‌గారు సువార్త ప్రకటించుచున్నారు. ఆచంట పరిసర ప్రాంతాలలో ప్రభువుయొక్క పని దిగ్విజయముగా జరుగుచున్నది. మార్చి నెల సువార్తికుల సదస్సు (Preachers' workshop) పెద్దాపురమునకు చేరియున్న గుడివాడ గ్రామంలో 22వ తేదీనాడు భవానీ ఇంగ్లీషు మీడియం స్కూలు ఆవరణలో జరుగును. అక్కడ సోదరులు T.Ch. ఫ్లెమింగ్స్ గారు సువార్తపని చేయుచున్నారు.

*　　*　　*　　*

ఫిబ్రవరి నెల 23 నుండి 26 వరకు పాలకొల్లులో గొప్ప సువార్త మహా సభలు జరిగినవి. ఈ సభలను పాలకొల్లు ఏరియా క్రీస్తు సంఘములు నిర్వహించినవి. 23వ తేదీ మంగళవారం ఉదయంనుండి 26వ తేదీ శుక్రవారం రాత్రివరకు పాలకొల్లు మునిసిపల్ ఓపెన్ ఎయిర్ థియేటరులో ఈ సభలు నిర్వహించబడినవి. ప్రతి దినము మూడు కూటములు జరిగేవి. ప్రతిరోజు వందలాది ప్రజలు హాజరయ్యేవారు. రాత్రికూటములకు 1200 నుండి 1500 వరకు ప్రజలు హాజరై దేవుని వాక్యాన్ని శ్రద్ధతో వినేవారు.

మద్రాసు నుండి వచ్చిన **Bro.** జి. దేవదానంగారు అన్ని రోజులలోను ఈ సభలలో దేవుని వాక్యపరిచర్య చేసిరి. సత్యవాణి రేడియో ప్రసంగీకులు జాషువాగూటంగారు ఆఖరి రెండు రోజులు సువార్త వాక్యమందించిరి. ప్రజలు అత్యానందముతో ఆయన బోధ నాలంకించిరి. ఆఖరి రోజు మధ్యాహ్నం **T.V.** సామ్సన్‌రాజు గారు కూడ కూటములో పాల్గొనిరి. పెద్దాపురం నుండి వచ్చిన **Bro. T. Ch.** ఫ్లెమింగ్స్‌గారు కూడ ఈ సభలలో ఒక దినం వాక్యపరిచర్య చేసిరి. ఈ సువార్త మహా సభలకు పాలకొల్లు బెత్లెహేముపేట క్రీస్తు సంఘము సువార్తికులు **S.** ఎబినేజర్‌గారు కన్వీనర్‌గా పనిచేసి తన నిర్విరామ కృషి వలన జయప్రదం చేసారు. బెత్లెహేముపేట క్రీస్తు సంఘము మరియు ఆ ప్రాంతములలో యున్న క్రీస్తు సంఘాలు, ఆయా సభ్యులు విరాళములిచ్చి ఆర్థికంగా తోడ్పడిరి. హాజరైన వారందరికీ గొప్ప ఆత్మీయ మేలు కలిగెను.

---

Regd. No. H/KD—45/KD H.O.

*From*
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA 533 001

**No.**

**To**
5490/ 351/DS
SUNNY DAVID
E-101 B. DEFENCE COLONY
RING ROAD
BOX 3815
110047